సాక్షి
నిజామాబాద్
గురువారం । 30 । జనవరి । 2025

పుణ్యస్నానానికి పోటెత్తిన భక్తులు



కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రంలో భక్తుల రద్దీ



పోచంపాడ్ పుష్కర ఘాట్ వద్ద పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పుష్య (మౌని) అమావాస్య సందర్భంగా జిల్లాలోని గోదావరి తీరంలో భక్తుల సందడి నెలకొంది. రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమం వద్ద, మెండోరా మండలం పోచంపాడ్ పుష్కరఘాట్ వద్ద భక్తులు నదిలో పుణ్యస్నానాలు చేశారు. కందకుర్తికి జిల్లాకు చెందిన భక్తులతో పాటు, మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గోదావరిలో తెప్పలు వదిలి మొక్కులు చెల్లించుకున్నారు. రెండుచోట్ల సరైన ఏర్పాట్లు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. – రెంజల్/బాల్కొండ

న్యూస్‌రీల్

రోగులను నిర్లక్ష్యం చేయొద్దు



వర్ని: వైద్యం కోసం వచ్చే రోగులను నిర్లక్ష్యం చేయొద్దని ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. వర్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రితోపాటు పాత వర్నిలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల హై స్కూల్‌ను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఇన్, అవుట్ పేషెంట్లు, రోగులకు అందిస్తున్న మందులు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలికల హైస్కూల్‌లో బియ్యం, కూరగాయలు, పప్పు దినుసులు, స్టోర్, వంట రూమ్‌లను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సాయిలు, ఎంపీడీవో వెంకటేశ్, ఎంఈవో సాయిలు తదితరులు ఉన్నారు.

జాన్కంపేట్ అటవీ ప్రాంతంలో చిరుత



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలం జాన్కంపేట్ అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందని అటవీ అధికారులు నిర్ధారించారు. మంగళవారం సాయంత్రం బ్యాంకు అధికారి బైక్‌ను చిరుత వెంబడించిందని సమాచారం అందడంతో చిరుత ఆనవాళ్లను గుర్తించేందుకు బుధవారం అటవీప్రాంతంలో పర్యటించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ప్రతాప్, బీట్ ఆఫీసర్ ప్రవీణ్‌రెడ్డి అటవీ ప్రాంతంలో చిరుత పాదముద్రలను గుర్తించారు. ఠాణాకలాన్, జానకంపేట్ అడవిలో పది కిలోమీటర్ల ప్రాంతంలో చిరుత సంచరిస్తోందని, గ్రామస్తులు ఒంటరిగా బయట తిరుగొద్దని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు చిరుతను బంధించేందుకు బోనులు ఏర్పాటు చేస్తామన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు.

ఆస్పత్రి కోసం స్థల పరిశీలన



సిరికొండ: సిరికొండ మండలంలోని చీమన్‌పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం కోసం స్థలాన్ని బుధవారం తహసీల్దార్ రవీందర్‌రావు పరిశీలించారు. గ్రామ పంచాయతీ భవనం వెనుక ఉన్న స్థలం అనువుగా ఉంటుందని గ్రామ పెద్దల సమక్షంలో నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సర్వేయర్ స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ నిరసన కార్యక్రమాలు

నిజామాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చి ఎన్నికల హామీలు అమ లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తా మని ఆయన తెలిపారు. నిరసన కార్యక్రమాలలో అన్నివర్గాల ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు, పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

ట్రాఫిక్ ఎస్సై బైక్ చోరీ

ఖలీల్‌వాడి: వాహనాల తనిఖీ చేపడుతున్న ట్రాఫిక్ ఎస్సై బైక్‌ను ఎత్తుకెళ్లాడో దొంగ. ఈ ఘటన నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌లో మంగళవారం చోటు చేసుకుంది. కంఠేశ్వర్ బైపాస్ వద్ద ట్రాఫిక్ ఎస్సై బైక్ పార్క్ చేసి వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై తన పనిలో బిజీగా ఉండగా దొంగ వచ్చి బైక్ ఎత్తుకెళ్లాడు. తనిఖీలు అయ్యాక బైక్ వద్దకు వెళ్లే సరికి కనిపించలేదు. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించి దొంగను పట్టుకున్నారు.

కోడ్ అమల్లోకి..

- పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ
- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్, 27న పోలింగ్, మార్చి 3న ఫలితాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రస్తుత పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పదవీ కాలపరిమితి వచ్చే మార్చి 29తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. వచ్చే ఫిబ్రవరి 3న ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. నామినేషన్ల దాఖలుకు ఫిబ్రవరి 10 చివరి తేదీ. ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. ఉపసంహరణకు చివరి తేదీ ఫిబ్రవరి 13. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేస్తారు. మార్చి 8న ఈ ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. ఎన్నికల కోడ్ తక్షణమే అమలులోకి రానుందని ఈసీ పేర్కొంది. దీంతో ప్రజాప్రతినిధుల అధికారిక కార్యక్రమాలకు బ్రేక్ పడింది. అప్పటి వరకు ఆయా ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు షెడ్యూల్‌లో ఉన్న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మార్చి రెండోవారానికి వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారపర్వం ఊపందుకోనుంది. ఇప్పటికే బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించింది. కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరనేది ఈ మూడునాలుగు రోజుల్లో తేలనుంది. బీఆర్‌ఎస్ తన అభ్యర్థులను నిలబెడుతుందా లేదా అనే విషయమై ఇప్పటికీ స్పష్టత లేదు. స్వతంత్ర అభ్యర్థులు సైతం భారీగానే బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది.

నిగ్గుతేలిన అక్రమం

కోటగిరి మండలం ఎత్తొండ సహకార సంఘంలో అవినీతి, అక్రమాలను అధికారులు నిర్ధారించారు. ఈ సంఘం రైస్ మిల్లులకు 29 వేల క్వింటాళ్ల ధాన్యం ఇవ్వగా తిరిగి సీఎంఆర్ ఇవ్వలేదు. దీని వెనుక భారీ కుంభకోణం చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు వెళ్లగా అధికారులు విచారణ చేపట్టారు. సీఈవోతో పాటు సిబ్బందిని సస్పెండ్ చేశారు. సొసైటీ పాలకవర్గాన్ని రద్దు చేసేందుకు సహకార శాఖ చర్యలకు దిగింది.

- ఎత్తొండ సొసైటీలో రూ.8.80 కోట్ల అక్రమాల నిర్ధారణ
- ఆరుగురు ఉద్యోగుల సస్పెన్షన్
- పాలకవర్గాన్ని రద్దు చేసేందుకు మాజీ చైర్మన్, ప్రస్తుత డైరెక్టర్లకు నోటీసులిచ్చిన అధికారులు
- అనుమానాలకు తావిస్తున్న డీసీవో వైఖరి.. వివరణ ఇచ్చేందుకు నిరాకరణ



ఎత్తొండ విండో కార్యాలయం వద్ద ధాన్యం డబ్బుల కోసం ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలోని కోటగిరి మండలం ఎత్తొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రూ.8,80,58,873 మేర అక్రమాలు చోటుచేసుకున్నట్లు నిగ్గుతేలింది. ఈ విషయమై గతంలో 'సాక్షి'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. అప్పటి డీసీవో సింహాచలం పాత్రపైనా 'సాక్షి' వరుస కథనాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో విచారణ చేసిన అధికారులు అక్రమాలు, అవకతవకలను నిర్ధారించారు. తగిన చర్యలకు ఉపక్రమించారు.

వివరాల్లోకి వెళితే.. కస్టమ్ మిల్లింగ్ బియ్యం కోసం ప్రభుత్వం నుంచి ఎత్తొండ సహకార సంఘం ఆధ్వర్యంలోని రైస్ మిల్లులకు 2022–23 యాసంగి, 2023–24 వానాకాలం సీజన్లకు కలిపి మొత్తం 29 వేల క్వింటాళ్ల ధాన్యం ఇచ్చారు. అయితే ప్రభుత్వానికి తిరిగి సీఎంఆర్ ఇవ్వలేదు. దీని వెనుక భారీ కుంభకోణం చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు వెళ్లాయి.

■ కుంభకోణంలో సహకార సంఘం సీఈవో సంతోష్, సేల్స్‌మెన్‌లు శ్రీధర్, హన్మంత్ రావు, ఫణి కుమార్, దేవరాజు, సేల్స్ ఉమెన్ మమత ప్రమేయం ఉందనే కారణంతో వీళ్లను క్రమశిక్షణ చర్యల కింద సస్పెండ్ చేస్తూ డీసీవో శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల రికవరీ కోసం సర్‌చార్జ్ నోటీసులు ఇచ్చారు.

■ కీలకమైన అంశం ఏమిటంటే ఎత్తొండ సొసైటీలో చోటుచేసుకున్న కుంభకోణంలో నోటీసులకు సంబంధించిన కాపీలు చూపించేందుకు జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు నిరాకరిస్తున్నారు. కుంభకోణం అధికారిక విచారణలో నిర్ధారణ అయినప్పటికీ గోప్యత పాటించేందుకు ప్రాధాన్యత ఇస్తుండడం గమనార్హం. పూర్తి వివరాలు వెల్లడిస్తే ఏదో జరిగిపోతుందనే భావన వ్యక్తం చేస్తుండడం విశేషం. ఈ కుంభకోణంలో మాజీ డీసీవో సింహాచలం పాత్ర ఉన్నట్లు స్పష్టమవుతోంది. సింహాచలాన్ని కాపాడేందుకు పాట్లు పడుతున్నట్లు తెలుస్తోంది. సాక్షాత్తూ ప్రభుత్వమే విచారణ చేయించి అక్రమాలు నిగ్గుతేలుస్తుంటే ప్రస్తుత డీసీవో వింత వైఖరితో ఉండడం అనేక అనుమానాలకు తావిస్తోందని పలువురు అంటున్నారు. డీసీవో శ్రీనివాసరావు కార్యాలయంలో తలుపులు వేసుకుని బయటవైపు తాళం వేయించుకుని లోపల పనిచేసుకుంటుండడం గమనార్హం. ఇది మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై మరిన్ని విమర్శలు వస్తున్నాయి.

■ అక్రమ వ్యవహారంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎత్తొండ సొసైటీ పాలకవర్గాన్ని సైతం రద్దు చేసేందుకు సహకార శాఖ చర్యలకు దిగింది. సొసైటీ మాజీ చైర్మన్ అశోక్ పటేల్ (కుంభకోణం వెలుగులోకి వచ్చాక కొన్ని నెలల క్రితం రాజీనామా చేశారు), ప్రస్తుత వైస్ చైర్మన్, ఇన్‌చార్జి చైర్మన్ రాందాస్, డైరెక్టర్లు అగ్గ లింగయ్య, కిశోర్ చంద్ర, శ్రీనివాస్, గంగాధర్, మన్నె పోశెట్టి, హన్మంత్ రావు, శ్యామ్, రాధ, విట్టబాయి, గంగారాం, సాయవ్వలకు నోటీసులు జారీ చేశారు. అవినీతి ఆరోపణలు నిర్ధారణ అయినందున పాలకవర్గాన్ని ఎందుకు రద్దు చేయకూడదో సంజాయిషీ ఇవ్వాలని 15 రోజులు గడువు ఇచ్చారు. అదేవిధంగా నిధుల రికవరీ కోసం సర్‌చార్జ్ నోటీసులు ఇచ్చారు.

ఏసీబీకి పట్టుబడిన లింగంపేట ఎస్సై



ఎస్సై కంది సుధాకర్

- ఫైనాన్స్ పంచాయితీలో లంచం తీసుకుంటూ..
- కేసు చేస్తానని బెదిరింపులు.. డబ్బులు డిమాండ్

రెండున్నర నెలల్లో ఇద్దరు ఎస్సైలు

లింగంపేట్: రెండున్నర నెలల వ్యవధిలో లింగంపేట్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఎస్సైలు ఏసీబీకి పట్టుబడ్డారు. ఇప్పటి వరకు మొత్తం నలుగురు ఎస్సైలు ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ పోలీస్ స్టేషన్ అవినీతికి అడ్డాగా మారిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది నవంబర్ 14న అప్పటి ఎస్సై అరుణ్‌కుమార్ ఏసీబీకి పట్టుబడ్డారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పని చేసేందుకు ఎవరూ ముందుకురాకపోగా, వచ్చిన వారి వ్యవహారం వివాదాస్పదమవుతోంది.

ఖలీల్‌వాడి: ఫైనాన్స్‌పై తీసుకున్న కారు పంచాయితీలో తలదూర్చిన కామారెడ్డి జిల్లా లింగంపేట్ ఎస్సై కంది సుధాకర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. లింగంపేట్‌కు చెందిన కమ్మరి కొండేశ్ స్విఫ్ట్ కారును ఫైనాన్స్‌లో కొనుగోలు చేసి కొన్ని రోజుల తరువాత స్థానికుడైన నవీన్‌గౌడ్‌కు అమ్మేశాడు. ఆ తరువాత నవీన్‌గౌడ్ కారును నిజామాబాద్‌లోని బోర్గాం(పి)లో ఉన్న సెకండ్‌కార్ బజార్‌లో 2022లో విక్రయించాడు. దానిని కొనుగోలు చేసిన సెకండ్ కార్ బజార్ యజమాని తులసీ వెంకటస్వామి అలియాస్ స్వామి నగరంలోని నాగారం ప్రాంతానికి చెందిన చిరంజీవికి అమ్మేశాడు. అయితే చిరంజీవికి కారు అమ్మే సమయంలో ఫైనాన్స్ సంస్థకు నెలవారీ వాయిదాలు చెల్లించాలని అంగీకారం కుదుర్చుకున్నారు. కారు ఈఎంఐలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ సిబ్బంది కమ్మరి కొండేశ్ వద్దకు వెళ్లి ప్రశ్నించగా.. ఆయన నవీన్‌గౌడ్ ద్వారా నిజామాబాద్‌కు వచ్చి కార్ బజార్ ఓనర్ తులసీ వెంకటస్వామి అలియాస్ స్వామిని కలిసి చిరంజీవిని పిలిపించి మాట్లాడించారు. అయినప్పటికీ చిరంజీవి వాయి దాలు చెల్లించకపోవడంతో కొండేశ్‌పై ఫైనాన్స్ సిబ్బంది ఒత్తిడి పెంచడంతో ఆయన లింగంపేట్ ఎస్సై కంది సుధాకర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సెకండ్ కార్ బజార్ యజమాని స్వామిని లింగంపేట్ స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై.. కారుతోపాటు చిరంజీవిని తీసుకురావాలని చెప్పాడు. కారు చందూర్ మండల కేంద్రంలో ఉన్నట్లు గుర్తించి ఈనెల 20న లింగంపేట్ పీఎస్‌కు వెంకటస్వామి తీసుకెళ్లాడు. అదే రోజు స్వామిని ఎస్సై మధ్యాహ్నం 3 నుంచి 7.30 గంటల వరకు లాకప్‌లో ఉంచి, అతడి సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేశాడు. కేసు సెటిల్ చేసుకోవాలని, రూ.20 వేలు చెల్లించాలని, సీఐకి కూడా ఇవ్వాల్సి ఉంటుందని ఎస్సై బేరం మొదలుపెట్టాడు. చివరికి రూ.12,500 ఇచ్చేందుకు స్వామి ఒప్పుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం లింగంపేట్ నుంచి నిజామాబాద్‌కు వచ్చిన ఎస్సై సుధాకర్ స్వామికి ఫోన్ చేశాడు. వినాయక్‌నగర్‌లోని రుక్మిణి చాంబర్ వద్ద కారులో ఎస్సై సుధాకర్‌కు స్వామి నగదు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్, సీఐలు శ్రీనివాస్, వేణుగోపాల్, సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సైని హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరుపర్చనున్న ట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ చెప్పారు. ఏసీబీకి పట్టుబడిన ఎస్సై సుధాకర్ స్వగ్రామం నవీపేట్ మండలం నాగేపూర్ అని పోలీసుల ద్వారా తెలిసింది.

లాకప్‌లో పెట్టాడనే పట్టించా..



ఎస్సై సుధాకర్ నన్ను లాకప్‌లో పెట్టి ఇబ్బంది పెట్టా డు. కారును తీసుకువెళ్లినా కేసు నమోదు చేస్తానని బెదిరించాడు. కారు ఫైనాన్స్ విషయంలో నా ప్రమేయం లేదని చెప్పినా లాకప్‌లో మూడున్నర గంటలపాటు ఉంచాడు. అందుకే ఏసీబీని ఆశ్రయించాను. కేసు కాకుండా డబ్బులు డిమాండ్ చేయడంతో పట్టించాను.

– తులసీవెంకటస్వామి, నిజామాబాద్

గర్భస్రావ మందులతో యువతి మృతి



కేసు వివరాలు వెల్లడిస్తున్న నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

- రిఫర్ చేసిన పీఎంపీ రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ఖలీల్‌వాడి: గర్భస్రావం మాత్రలు రిఫర్ చేసి ఓ యువతి మరణానికి కారణమైన పీఎంపీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రాజావెంకట్ రెడ్డి తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏసీపీ బుధవారం వెల్లడించారు. మాక్లూర్ మండలానికి చెందిన యువతి, మెండోరా మండలం సావెల్‌కు చెందిన యువకుడు కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం కారణంగా యువతి గర్భం (2 నుంచి 3 నెలలు) దాల్చడంతో యువకుడు తన గ్రామంలో క్లినిక్ నిర్వహిస్తున్న ముప్కాల్ మండలం రెంజర్లకు చెందిన పీఎంపీ హరికృష్ణచారిని ఈనెల 4న సంప్రదించాడు. పీఎంపీ సూచించిన మాత్రలను యువకుడు అదే రోజు యువతికి ఇవ్వగా మూడు రోజుల తరువాత ఆమెకు కడుపు నొప్పితోపాటు బ్లీడింగ్ అయ్యింది. దీంతో యువతిని ఆమె తల్లి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. యువతికి గర్భస్రావమైందని, కిడ్నీ, లివర్‌కు ఇన్ఫెక్షన్ వచ్చిందని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఈనెల 10న హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో యువతి మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పీఎంపీని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

పీఎంపీలపై కేసులు

ఎలాంటి అర్హతలు లేకుండా నిజామాబాద్ డివిజన్‌లో ప్రజలకు వైద్యం చేస్తున్న పలువురు పీఎంపీలపై కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మెడికల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టి ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేశామన్నారు. ఇందల్వాయి పోలీస్‌స్టేషన్‌లో కె.గంగాధర్(ఇందల్‌వాయి), డిచ్‌పల్లి పీఎస్‌లో ఆర్ రాజేందర్(మానస క్లినిక్), ఎం వెంకటేశ్వర్(మణికంఠ క్లినిక్, మిట్టపల్లి), దత్తాద్రి(ప్రశాంత్ క్లినిక్, డిచ్‌పల్లి), గోలి సందీప్(లక్ష్మినరసింహ క్లినిక్, డిచ్‌పల్లి), ఐదో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏ మల్లేశం(చందన క్లినిక్, న్యాల్‌కల్ రోడ్), మోపాల్ పీఎస్‌లో విఠల్‌సింగ్(ఏ1), సూర మహేశ్‌కుమార్ (ఏ2)పై కేసులు నమోదైనట్లు వివరించారు.

వివాదాలు.. విచారణలు

గాడితప్పిన విద్యాశాఖ

- స్కావెంజర్ల వేతనాలు మింగేస్తున్న కొందరు హెచ్‌ఎంలు
- ప్రత్యేక తరగతులపై పర్యవేక్షణ కరువు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖ రోజురోజుకూ వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. వివాదాలు.. విచారణల చుట్టూ ఉన్నతాధికారులు తిరుగుతుండడంతో విద్యాబోధన గాడి తప్పుతోంది. పలుచోట్ల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు మధ్య వివాదాలు నెలకొనగా, మరికొన్ని చోట్ల సమయపాలన, పాఠ్యాంశాల బోధనను పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రతిరోజూ ఏదో ఒక వివాదం జరగడం, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. ఫిర్యాదులపై విచారణ చేపడుతున్న ఉన్నతాధికారులు విద్యావ్యవస్థను గాడిలో పెట్టడంపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పలువురు హెచ్‌ఎంల వ్యవహారశైలి ఇప్పటికే వివాదాస్పదం కాగా, మరికొందరు స్కావెంజర్ల వేతనాలను మింగేస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొన్ని ప్రాంతాల్లో అసలు ప్రారంభంకాకపోవడం గమనార్హం.

■ ధర్పల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై గ్రామస్తులతోపాటు టీచర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి బియ్యం నిల్వల లెక్కలు లేకపోవడం, టీచర్లను వేధించడం, హెచ్‌ఎం భర్త విద్యాబోధనలో జోక్యం చేసుకోవడం వంటి అనేక వివాదాలు ఉన్నాయి. దీనిపై ఎంఈవో విచారణ చేపట్టి పాఠశాల ఆర్జేడీకి ఫిర్యాదు చేయగా హెచ్‌ఎంపై ఇటీవలే సస్పెన్షన్ వేటు పడింది.



■ తమను అనవసరంగా తిట్టడంతోపాటు సెలవుల విషయంలో వేధిస్తున్నారని ధర్పల్లి మండలంలోని దుబ్బా పాఠశాల హెచ్‌ఎంపై టీచర్లు జిల్లా విద్యాశాఖ అధికారికి, ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పాఠశాల గ్రాంట్ నిధులు వినియోగించకపోవడం, సరైన లెక్క చూపకపోవడం వంటి ఆరోపణలున్నాయి. ఓ విద్యార్థి తన కుర్చీకి దూల కాయ పెట్టగా తనను హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఎంఈవో, డీఈవోకు టీచర్లపై హెచ్‌ఎం ఫిర్యాదు చేసింది. విద్యార్థులు ఇటీవల టూర్ వెళ్లేందుకు హెచ్‌ఎం అనుమతించకపోవడంతో గ్రామస్తులు అనుమతి పత్రం ఇచ్చారు. దీంతో టీచర్లు విద్యార్థులను టూర్‌కు తీసుకెళ్లారు. దీనిపై హెచ్‌ఎం సీరియస్ అయ్యి టీచర్లపై మండిపడింది.

■ బాల్కొండ మండలంలోని మరో ప్రధాన ఉపాధ్యాయుడు పాఠశాల గ్రాంట్‌ను సరైన నివేదిక లేకుండా ఖర్చు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై విచారణ కొనసాగుతోంది.

■ వర్ని మండలంలోని ఓ హెచ్‌ఎం ప్రాథమిక పాఠశాలకు సంబంధించి సామగ్రిని అనుమతి లేకుండా విక్రయించి ఆ డబ్బులను కాజేశాడు.

నామమాత్రంగా ప్రత్యేక తరగతులు

వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. కానీ జిల్లాలోని చాలా చోట్ల ప్రత్యేక తరగతులు అటకెక్కాయి. జిల్లా కేంద్రానికి దగ్గర ప్రాంతంలో తరగతులు కొనసాగుతుండగా సరిహద్దు ప్రాంతాల్లో అసలు నిర్వహించడం లేదు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యాబోధన అటకెక్కింది. సమయపాలనను పట్టించుకునే వారు లేకుండాపోయారు.

వేతనం అడిగితే పని మానేయాలని దబాయింపు

పలు పాఠశాలల హెచ్‌ఎంలు స్కావెంజర్ల వేతనాలను తమ జేబుల్లో వేసుకుంటున్నారు. వర్ని మండలం ఎస్‌ఎన్ పురంలో స్కావెంజర్‌కు హెచ్‌ఎం గత కొన్ని నెలలుగా డబ్బులు ఇవ్వడం లేదు. స్కావెంజర్ వేతనం అడిగితే.. రావడం లేదని, ఇష్టం లేకపోతే పనిమానేయాలని దబాయిస్తున్నాడు. దీంతో అక్కడి స్కావెంజర్ వీడీసీ ఇచ్చే రూ.2 వేలతోనే నెట్టుకొస్తున్నాడు. ధర్పల్లి మండల కేంద్రంలో స్కావెంజర్‌కు గత కొన్ని నెలలుగా వేతనం ఇవ్వకపోవడంతో విచారణ చేపట్టిన అధికారులు చర్యలు తీసుకున్నారు. నవీపేట మండలంలో ఓ హెచ్‌ఎం కూడా స్కావెంజర్ డబ్బులు వాడుకుంటున్నారు. పాఠశాలలో ముగ్గురు స్కావెంజర్లు ఉన్నట్లు వేతనాలు మంజూరవుతుండగా, ఇక్కడ ఒక్కరు మాత్రమే పని చేస్తున్నారు.

పర్యవేక్షిస్తాం

పాఠశాలల పర్యవేక్షణను పకడ్బందీగా చేపడతాం. ఎక్కడ కూడా లోపాలు లేకుండా చూస్తాం, ఇటీవల కొన్ని ఘటనలపై ఫిర్యాదులు అందడంతో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకున్నాం. ఎక్కడా వివాదాలు చోటుచేసుకోకుండా చూస్తాం.

– అశోక్, డీఈవో

క్లుప్తంగా

కుంభమేళాలో 'ధన్‌పాల్‌' పుణ్యస్నానం



సుభాష్‌నగర్‌: మహా కుంభమేళాలో అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ కుటుంబ సమేతంగా బుధవారం పుణ్యస్నానం ఆచరించారు. మౌని అమావాస్య పురస్కరించుకుని ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించామని ఎమ్మెల్యే తెలిపారు.

మల్లెపూల నరేందర్‌ ఆదర్శప్రాయుడు



నిజామాబాద్‌ సిటీ: అంకితభావంతో పనిచేసి వార్త సేకరణలో ప్రాణాలు కోల్పోయిన మల్లెపూల నరేందర్‌ జర్నలిస్టులకు ఆదర్శప్రాయుడని నుడా చైర్మన్‌ కేశ వేణు అన్నారు. బుధవారం నగరంలో నరేందర్‌ వర్ధంతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నరేందర్‌ అంకితభావం, నిబద్ధత కలిగిన జర్నలిస్టు అన్నారు. గ్రామీణ సమస్యలు వెలికి తీసి వాటి పరిష్కారం కోసం కృషి చేసేవారన్నారు. వార్త సేకరణ కోసం వెళ్లిన నరేందర్‌ 1991న ముదక్‌పల్లి వద్ద జరిగిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. అనంతరం నరేందర్‌ స్మారక క్రీడా పోటీల్లో గెలుపొందిన జర్నలిస్టులకు భక్తవత్సలంతో కలిసి ఆయన బహుమతులు అందజేశారు.

వాలీబాల్‌ టీం కెప్టెన్‌గా ఎంపిక



చైతన్య



రోహిత్‌

ఖలీల్‌వాడి: కరీంనగర్‌లో జరుగుతున్న పోలీస్‌ క్రీడల్లో బాసర జోన్‌ వాలీబాల్‌ టీం కెప్టెన్‌గా కమ్మర్‌పల్లికి చెందిన ఉట్నూర్‌ చైతన్య, వైస్‌ కెప్టెన్‌గా ఉట్నూర్‌ రోహిత్‌ ఎంపికయ్యారు. చైతన్య వేల్పూర్‌ పీఎస్‌లో, రోహిత్‌ నిజామాబాద్‌ రూరల్‌ ఠాణాలో పని చేస్తున్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో 'ఢై ఆఖర్‌' పోటీలు

నిజామాబాద్‌ రూరల్‌: తపాలా శాఖ ఆధ్వర్యంలో ఢై ఆఖర్‌ పేరిట లెటర్‌ రైటింగ్‌ పోటీలు నిర్వహిస్తున్నట్లు తపాలా శాఖ జిల్లా సీనియర్‌ సూపరింటెండెంట్‌ జనార్దన్‌ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లలోపు, 18 ఏళ్లు నిండిన వారికి వేర్వేరు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ది జాయ్‌ ఆఫ్‌ లెటర్‌ రైటింగ్‌, ఇంపార్టెన్స్‌ ఆఫ్‌ లెటర్స్‌ ఇన్‌ ఏ డిజిటల్‌ ఏజ్‌ అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇన్లాండ్‌ లెటర్‌లో 500 పదాలకు మించకుండా, ఎన్వలప్‌ విభాగంలో వెయ్యి పదాలకు మించకుండా లేఖలు రాయాలన్నారు. లేఖలను ది చీఫ్‌ పోస్టుమాస్టర్‌ జనరల్‌, తెలంగాణ సర్కిల్‌ పేరున రాయాలని వివరించారు. వివరాల కోసం దగ్గరలోని పోస్ట్‌ ఆఫీస్‌ను సంప్రదించాలని సూచించారు. లేఖలను ఈ నెల 31లోగా పంపాలన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తారని తెలిపారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా నూర్జహాన్‌

నిజామాబాద్‌ సిటీ: సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు నూర్జహాన్‌ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఇటీవల సంగారెడ్డిలో జరిగిన పార్టీ మహాసభల్లో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆమెను రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ఎన్నుకోగా, జిల్లా నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు.

తీరనున్న సాగునీటి కష్టాలు

- నాగాపూర్‌ లిఫ్ట్‌కు రెండో మోటారు
- నీటిమట్టం తగ్గగానే అమర్చడానికి ఏర్పాట్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

బాల్కొండ: మండలంలోని నాగాపూర్‌ గ్రామ శివారులో ఎస్సారెస్పీ బ్యాక్‌ వాటర్‌ ఆధారంగా నిర్మించిన నాగాపూర్‌ ఎత్తిపోతల పథకం ఆయకట్టుకు సాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఎస్సారెస్పీ బ్యాక్‌ వాటర్‌ ఆధారంగా రూ.84 లక్షలతో నాగాపూర్‌ ఎత్తిపోతల పథకం నిర్మించారు. కానీ 1062 అడుగుల నీటి మట్టం వద్ద నిర్మించారు. దీంతో యాసంగి సీజన్‌ చివరలో ప్రాజెక్ట్‌ నీటి మట్టం తగ్గడంతో పంటలకు నీరు అందక ఎండిపోయేవి. ఈ లిఫ్ట్‌ ఆధారంగా 1060 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది. దీంతో గత ప్రభుత్వ హయంలో 1054 అడుగుల నీటి మట్టం వద్ద రెండో లిఫ్ట్‌ నిర్మాణం చేపట్టాలని నిధులను మంజూరు చేశారు. రెండో లిఫ్ట్‌ ఏర్పాటు చేసే ప్రాంతం నుంచి మొదటి లిఫ్ట్‌ వరకు ప్రాజెక్ట్‌లో పైపు లైన్‌ కూడా పూర్తి చేశారు. కాని నీటి సరఫర చేయుటకు మోటార్లను అమర్చలేదు. దీంతో రెండో లిఫ్ట్‌ ద్వారా నీరు మొదటి లిఫ్ట్‌కు అందడం కలగానే మిగిలి పోయింది. ప్రస్తుతం రెండో లిఫ్ట్‌ కోసం కావాల్సిన మోటారు సరఫరా కావడంతో ఆయకట్టు రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రస్తుతం రెండో లిఫ్ట్‌ వద్ద నీరు ఉండటంతో రెండో లిఫ్ట్‌ పైపులైన్‌ ప్రాజెక్ట్‌లో నీట మునిగి ఉంది. నీటి మట్టం తగ్గిన తరువాత మోటార్లు బిగిస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుత సంవత్సరం మొదటి లిఫ్ట్‌ ద్వారా చివరి వరకు నీరు అందే అవకాశం లేదు. దీంతో నీరు తగ్గగానే మోటారు అమర్చి సాగునీరు సరఫరా చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



మోటార్లు బిగించనున్న ప్రాంతం



నాగాపూర్‌ మొదటి లిఫ్ట్‌

చివరి వరకు నీరు అందుతుంది



రెండో లిఫ్ట్‌కు మోటార్లు బిగిస్తే ఆయకట్టు చివరి వరకు పంటలకు నీరు అందుతుంది. మొదటి లిఫ్ట్‌ ఎత్తులో నిర్మించడంతో పంటలు చేతికందే సమయంలో నీరు అందక ఎండిపోయేవి. ఇప్పుడు సమస్య ఉండదు.

– ఎంబరి చిన్న నర్సయ్య, ఆయకట్టు రైతు

నీరు తగ్గగానే బిగించాలి



ప్రాజెక్ట్‌లో నీరు తగ్గగానే వెంటనే రెండో మోటారు బిగించాలి. ప్రస్తుత సంవత్సరం కూడ రెండో లిఫ్ట్‌ ద్వారా నీరు అవసరం పడుతుంది. చివరలో పంటలు ఎండకుండా మోటారు సరఫరా చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– నర్సయ్య, ఆయకట్టు రైతు

కేంద్ర మంత్రి సంజయ్‌ వ్యాఖ్యలు సరికాదు

రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ: పద్మ అవార్డును గద్దర్‌కు ఇవ్వాలన్న డిమాండ్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్‌ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని పెద్దవాల్గోట్‌ శివారులో గల శ్రీహిల్స్‌ అన్నపూర్ణేశ్వరి దేవి ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పద్మ అవార్డులు వారి సేవలకు ఇస్తారని పార్టీ సిద్ధాంతం పై ఇచ్చేవి కావన్నారు. గద్దర్‌ కుటుంబ సభ్యులతో పాటు తెలంగాణ సమాజానికి బండి సంజయ్‌ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పెద్దవాల్గోట్‌లోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. భోజనం సరిగా పెడుతున్నారా అని ఆరా తీశారు. పాఠశాలలో కావాల్సిన వసతులపై హెచ్‌ఎం ఫర్వీన్‌బేగం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందచేశారు. నిజామాబాద్‌ ఏఎంసీ చైర్మన్‌ ముప్ప గంగారెడ్డి, నాయకులు గడ్కోల్‌ భాస్కర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్‌, మునిపల్లి సాయారెడ్డి, ఎర్రన్న, నరేష్‌, నర్సారెడ్డి, రాంరెడ్డి, దేగాం సాయన్న, దశరథ్‌రెడ్డి, రాజారెడ్డి, లింబాద్రి, భానుచందర్‌ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం వికటించడంతో 16 విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. భోజనం తిన్న గంట తర్వాత విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. దీంతో వారిని ఉపాధ్యాయులు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యులు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్‌ అందించాలి

- నోడల్‌ అధికారి, చీఫ్‌ ఇంజినీర్‌ బూస అశోక్‌



సర్టిఫికెట్‌ అందజేస్తున్న సీఈ అశోక్‌

సుభాష్‌నగర్‌: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ అందించడమే లక్ష్యంగా పని చేయాలని నోడల్‌ అధికారి, చీఫ్‌ ఇంజినీర్‌ (ఆపరేషన్‌-1, వరంగల్‌) బూస అశోక్‌ సూచించారు.బుధవారం నగరంలోని ఎస్‌ఈ కార్యాలయంలో వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన ఎస్‌ఈ, డీఈ, ఏడీఈలతో సమావేశం నిర్వహించారు. అశోక్‌ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు రూ.ఆరు కోట్లతో ఆరు పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్లు నూతనంగా ఏర్పాటు చేశామని తెలిపారు. రూ.13.1 కోట్లతో 33 కేవీ ఇంటర్‌ లింకింగ్‌ లైన్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రూ.5కోట్లతో కొత్త వీసీబీలు ఏర్పాటు చేయడానికి పనులు జరుగుతున్నాయని చెప్పారు. వేసవిలో విద్యుత్‌ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా నాణ్యమైన విద్యుత్‌ అందించడానికి కృషి చేస్తామన్నారు. పెండింగ్‌ పనులను ఫిబ్రవరిలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎన్పీడీసీఎల్‌ ఎస్‌ఈ రాపల్లి రవీందర్‌, ట్రాన్స్‌ కో ఎస్‌ఈ సూర్య నర్సింహారావు, డీఈలు రమేశ్‌, పీవీ రాజేశ్వర్‌రావు, జాడే ఉత్తమ్‌, ఎండీ ముక్తార్‌, వెంకట రమణ పాల్గొన్నారు.

జిల్లాకు మూడో స్థానం

ఎన్పీడీసీఎల్‌ కంపెనీలో ఉత్తమ సేవలకుగాను జిల్లాకు మూడోస్థానం లభించింది. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ పథకాలను ప్రకటించారు. ఈ మేరకు సమావేశంలో చీఫ్‌ ఇంజినీర్‌ బూస అశోక్‌ నిజామాబాద్‌ ఎస్‌ఈ రాపల్లి రవీందర్‌కు సర్టిఫికెట్‌, మెమెంటోను అందజేశారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత

ఖలీల్‌వాడి: వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల, రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం రోడ్డు రవాణా సంస్థ, ట్రస్మా ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీరామగార్డెన్‌లో విద్యార్థులకు ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొదన్నారు. కారులో వెళ్లేవారు సీటు బెల్ట్‌ పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ ధరించాలని సూచించారు. ట్రాఫిక్‌ నిబంధనల గురించి విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ కలెక్టర్‌ అంకిత్‌, డీసీపీ బస్వారెడ్డి, డీటీసీ దుర్గాప్రమీల, డీటీవో ఉమామహేశ్వర్‌రావు, ఆర్టీఏ సభ్యులు రాజానరేందర్‌రెడ్డి, ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ, ఎంవీఐలు కిరణ్‌కుమార్‌, వివేకానందరెడ్డి, శ్రీనివాస్‌, రాహుల్‌ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపొద్దు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నిజామాబాద్‌ నాగారం : లింగ వివక్ష చూపొద్ద ని ఆరోగ్య విద్యా బోధకులు ఘనపూర్‌ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం అర్బన్‌ మెప్మా మహిళా సంఘాల సమావేశంలో ఆయన వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. లింగా నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. పీఎంసీ శోభారాణి, అశోక్‌ పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

చంపుతారనే భయంతో భార్య హత్య

- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు



స్వప్న (ఫైల్‌)

రెంజల్‌(బోధన్‌): భార్యపై అనుమానం.. ప్రియుడితో కలిసి తనను హత్య చేస్తుందనే భయంతో ఓ వ్యక్తి తన భార్యను హతమార్చాడు. ఈ ఘటన రెంజల్‌ మండలం బోర్గాం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. బోర్గాం గ్రామానికి చెందిన చిరడి పోతన్న, నీరడి స్వప్న(35) భార్యాభర్తలు. స్వప్న మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని పోతన్న అనుమానించేవాడు. అంతేగాక ప్రియుడితో కలిసి తనను చంపుతుందేమోనని భయపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం పొలం వద్ద భార్యను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని చెరువులో పడేశాడు. అదేరోజు రాత్రి భార్య కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మళ్లీ తానే బుధవారం ఉదయం స్టేషన్‌కు వెళ్లి తన భార్యను చంపినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకొని జాలర్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్‌ రూరల్‌ సీఐ విజయ్‌ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్‌



ఇందల్వాయి: చోరీ కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌, ఎస్సై మనోజ్‌ కుమార్‌ తెలిపారు. ఈ నెల 25న ఇందల్వాయికి చెందిన ఆసది రాజేశ్వరి ఇంట్లో చోరీ జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టిన పోలీసులు అదే గ్రామానికి చెందిన ఆసది రాజేశ్‌ చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు

కామారెడ్డి టౌన్‌: పోక్సో కేసులో ఓ నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి లాల్‌ సింగ్‌ నాయక్‌ తీర్పు వెల్లడించారని ఎస్పీ సింధూశర్మ బుధవారం తెలిపారు. వివరాలు.. దేవునిపల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన పదేళ్ల బాలిక ఇంటి బయట ఆడుకుంటుండగా 2020 సెప్టెంబర్‌ 27న అడ్లూర్‌ శివారులోని కామారెడ్డి రాజీవ్‌ గృహకల్పకు చెందిన షేక్‌ కరీం అలియాస్‌ కరిముల్లా లైంగిక దాడికి పాల్పడ్డాడు. దేవునిపల్లి పోలీస్‌ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

భూమి కోసం తండ్రి హత్య

ఎడపల్లి: భూమి కోసం కన్న తండ్రిని కుమారుడు హత్య చేసినట్లు బోధన్‌ రూరల్‌ సీఐ విజయ్‌బాబు తెలిపారు. ఎడపల్లి మండలం జాన్కంపేటలో జరిగిన హత్య కేసు వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. జాన్కంపేట్‌కు చెందిన నర్సయ్య(50)కు కొడుకు రాజశేఖర్‌, కూతురు ఉన్నారు. కూతురి పెళ్లి అయింది. రాజశేఖర్‌ మద్యానికి బానిస అయ్యాడు. తన తండ్రి పేరిట ఉన్న రెండు ఎకరాల భూమిని చెల్లెలి పేరు మీద రిజిస్ట్రేషన్‌ చేస్తాడని భావించి మంగళవారం రాత్రి గొడవ పడ్డాడు. ఈ క్రమంలో రాజశేఖర్‌ ఈలపీటతో దాడి చేయడంతో నర్సయ్య మృతి చెందాడు. కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

ఖలీల్‌వాడి: రైలులో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటిక పట్టుకున్నట్లు ఆర్పీఎఫ్‌ సీఐ సుబ్బారావు తెలిపారు. వివరాలు.. నిజామాబాద్‌ రైల్వే స్టేషన్‌లో దేవగిరి, నాందేడ్‌–సంబల్పూర్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లను బుధవారం ఆర్పీఎఫ్‌ సిబ్బంది తనిఖీ చేశారు. రైళ్లలో సీట్ల కింద ఉన్న నల్లబెల్లం, పటిక సంచులు గుర్తించినట్లు ఆయన తెలిపారు. వీటి విలువ రూ.3.80 లక్షల ఉంటుదన్నారు. వాటిని ఎక్సైజ్‌ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

మంత్రాల నెపంతో దాడి

రెంజల్‌(బోధన్‌):మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో స్థానికులు ఓ వ్యక్తిని చితకబాది పోలీసులకు అప్పగించారు. రెంజల్‌ మండలం సాటాపూర్‌లో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. రామాయంపేటకు చెందిన ఆనంద్‌ రాత్రిపూట అనుమానాస్పదంగా తిరుగుతూ ఇళ్ల ముందు నిమ్మకాయలు పడేస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. దీంతో చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు.

దొంగల హల్‌చల్‌

మద్నూర్‌(జుక్కల్‌): మండలంలోని పెద్దతడ్గూర్‌, చిన్నతడ్గూర్‌, ఖరగ్‌ గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్‌ చేశారు. మూడు గ్రామాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడ్డారు. వివరాలు.. పెద్దతడ్గూర్‌కి చెందిన కోండవార్‌ చంద్రకాంత్‌ కుటుంబ సభ్యులు మహారాష్ట్రలో ఉంటారు. వీరు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. లోపలక ఏమీ దొరకలేదు. అనంతరం చిన్నతడ్గూర్‌, ఖరగ్‌ గ్రామాల్లో సైతం మూడు ఇళ్లలో చోరీ చేశారు. బంగారు, వెండి ఆభరణాలు పోయినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై సాయిలు తెలిపారు.

ఇరువర్గాల మధ్య గొడవ

ఖలీల్‌వాడి: నగరంలోని సిటీ హాస్పిటల్‌ వద్ద ఉన్న స్నూకర్‌ పార్లర్‌ వద్ద బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. బర్కత్‌పురాకు చెందిన ముల్లా బాసన్‌ఖాన్‌తో గున్నా గ్యాంగ్‌ మాట్లాడుతుండగా వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో బాసన్‌ఖాన్‌పై స్నూకర్‌ స్టిక్‌తో దాడి చేయగా తలకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి



రుద్రూర్‌: రుద్రూర్‌ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన దాల్‌మల్క బాబయ్య (22) వల చుట్టుకొని మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బుధవారం ఉదయం నుంచి బాబయ్య కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఈ క్రమంలో చెరువులో మృతదేహం తేలింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని గంజి మార్కెట్‌ దగ్గర గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. మృతుడిపై నలుపు రంగు టీ షర్ట్‌, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. సదరు వ్యక్తి నగరంలో భిక్షాటన చేస్తూ జీవించేవాడని తెలిపారు.

ఇంట్లో మృతదేహం

ఆర్మూర్‌ టౌన్‌: ఆర్మూర్‌ మండలం గోవింద్‌పేట్‌ గ్రామంలో ఓ ఇంట్లో మృతదేహం ఉన్నట్లు బుధవారం స్థానికులు గుర్తించారు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో కిటికీలోనుంచి చూడగా మృతదేహం కనిపించింది. ఆ ఇంట్లో స్వప్న, శ్రీనివాస్‌ అనే దంపతులు ఉంటున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్‌టీం సభ్యులు వచ్చే వరకు ఆధారాలు చెదిరిపోకుండా తాళం తెరిచి లోనికి వెళ్లలేదు. గురువారం క్లూస్‌టీం సభ్యులతో కలిసి మృతదేహాన్ని పరిశీలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

మాఘమాస స్నానానికి వెళ్లి బాలుడి మృతి



శేఖర్‌(ఫైల్‌)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మాఘమాస స్నానానికి కుటుంబ సభ్యులతో వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన తాడ్వాయి మండలం సంతాయిపేట శివారులోని భీమేశ్వర ఆలయం వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. రాజంపేట మండలంలోని కొండాపూర్‌ గ్రామపరిధి గుడితండాకు చెందిన రమావత్‌ రాజు, శాంతి దంపతుల కుమారుడు శేఖర్‌(16) పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం మాఘ అమావాస్య సందర్భంగా స్నానం చేయడానికి తల్లిదండ్రులతో కలిసి సంతాయిపేటలో భీమేశ్వర ఆలయం వద్ద గల వాగుకు వెళ్లాడు.భీమేశ్వర వాగులో స్నానం చేయడానికి దిగిన శేఖర్‌ ప్రమాదవశాత్తు నీట మునిగాడు. అక్కడే ఉన్న కొందరు వాగులోకి దూకి శేఖర్‌ను బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు.

పని ఒత్తిడితో భగీరథ ఏఈఈ ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి



సాయిచరణ్‌ (ఫైల్‌)

డిచ్‌పల్లి: ధర్పలి మండలంలో నీటి పారుదల శాఖ (మిషన్‌ భగీరథ)లో అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న కత్తులపురం సాయిచరణ్‌ (30) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌ జిల్లా ఖానాపూర్‌కు చెందిన సాయిచరణ్‌ ప్రస్తుతం నిజామాబాద్‌ జిల్లా కేంద్రంలోని సుభాష్‌ నగర్‌లో నివసిస్తున్నాడు. ఆరు నెలల క్రితం మిషన్‌ భగీరథలో ఏఈఈగా ఉద్యోగం సాధించి ధర్పల్లి మండలంలో పని చేస్తున్నాడు. ఇటీవల ఉద్యోగంలో పని ఒత్తిడి ఎక్కువగా ఉందని తల్లిదండ్రులతో చెప్పి మానసికంగా బాధపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ధర్పల్లిలో డ్యూటీకి వెళుతున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి బయలు దేరాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో డిచ్‌పల్లి మండలం నడిపల్లి శివారులో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సాయిచరణ్‌ను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి అక్క హారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లిని చంపిన తనయుడి రిమాండ్‌

- విచారణలో వెలుగులోకి మరో హత్య



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ

రుద్రూర్‌: కోటగిరి మండలం జల్లాపల్లి ఫారంలో మంగ్లీబాయిని హత్య చేసిన కేసులో ఆమె కుమారుడు నేనావత్‌ రాములును పోలీసులు విచారిస్తుండగా మరో హత్య వెలుగులోకి వచ్చింది. కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రుద్రూర్‌ సీఐ కృష్ణ వివరాలు వెల్లడించారు. జల్లాపల్లి ఫారానికి చెందిన రాములు మద్యం, జల్సాలకు బానిసయ్యాడు. తన తల్లి మంగ్లీబాయి (72) వద్ద ఉన్న డబ్బులు, నగల కోసం ఈ నెల 26న రాత్రి ఆమెను గ్రామంలోని నీటి కుంటలో ముంచి హత్య చేశాడు. పోలీసులు బుధవారం పోతంగల్‌ చెక్‌పోస్టు వద్ద రాములును అదుపులోకి తీసుకుని విచారించగా తల్లిని చంపినట్టు ఒప్పుకున్నాడు. దీంతో పాటు మూడు నెలల క్రితం గైని మాదమ్మ అనే మహిళను కూడా హత్య చేసినట్టు విచారణలో వెల్లడించాడు. కోటగిరి మండలం నాగేంద్రపురం గ్రామానికి చెందిన మాదమ్మను కామారెడ్డి జిల్లా బీర్కూర్‌ మండలం బరంగెడ్గి శివారులో గొంతు నులిమి చంపి కాలువలో పడేశాడు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలు తీసుకున్నట్లు రాములు ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌ చేసినట్లు సీఐ వివరించారు. సమావేశంలో కోటగిరి ఎస్సై సందీప్‌, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగనోట్ల కేసులో మరొకరి అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

గాంధారి: గాంధారి మండలం చద్మల్‌ తండాలో దొంగనోట్ల చెలామణి కేసులో బుధవారం మరో నిందితుడిని అరెస్ట్‌ చేసినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. చద్మల్‌ తండాలో సంక్రాంతి సందర్భంగా లక్ష్మమ్మ గుడివద్ద జరిగే జాతరలో వచ్చిన కానుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తండావాసులకు అప్పుగా ఇస్తారు. ఈ క్రమంలో కొందరు అసలు నోట్ల కట్టల్లో దొంగనోట్లు ఉంచి ఇచ్చారు. అప్పు తీసుకున్న వారు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈ కేసులో ఈ నెల 24న ఏడుగురు నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులు మారుసుకోల తిరుపతి అలియాస్‌ రాజు, జగన్‌ పరారీలో ఉండగా తిరుపతిని బుధవారం మంచిర్యాల జిల్లా అన్నారం గ్రామంలో అరెస్ట్‌ చేసినట్లు తెలిపారు. సమావేశంలో సదాశివ నగర్‌ సీఐ సంతోష్‌ కుమార్‌, ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.